
సాక్షి మహబూబాబాద్

గురువారం । 19 । డిసెంబర్ । 2024



అధిక పన్ను వస్తే అప్పీల్..

అధిక ఆదాయ పన్ను వస్తే అప్పీల్ చేసుకుంటే సమస్య పరిష్కారం అవుతుందని ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ముకాంబికేయన్ తెలిపారు. - 8లో▸



'భద్రకాళి' అంచున ఆదిమానవులు?

వరంగల్‌లోని భద్రకాళి చెరువు చుట్టూ ఆదిమానవులు జీవనం సాగించినట్లు ఆధారాలు లభ్యమైనట్లు రత్నాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

పిల్లలు, పెద్దలు జాగ్రత్త..

ఊపిరితిత్తుల సమస్యలు ఉండే వారికి ఇబ్బందులు

డాక్టర్ ఎం.పవన్‌కుమార్ జనరల్ మెడిసిన్ ఎండి.ప్రొఫెసర్ భూపాలపల్లి

ఎంజీఎం : చలి తీవ్రత ఎక్కువైనందున పిల్లలు, పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ చలితో చర్మం, ఊపిరితిత్తుల సమస్యలతోపాటు గుండె సంబంధ వ్యాధుల వారికి డిప్రెషన్ పెరిగే అవకాశం ఉంటుంది.

- చర్మం పొడిబారకుండా మాశ్చరైజర్ రాసుకోవాలి. న్యూమోనియా, బ్రాంకైటీస్, అస్తమా వంటి ఊపిరితిత్తుల ఇబ్బంది తలెత్తకుండా చల్లగాలిలో తిరగడం, దుమ్ము ధూళి ఉండే పరిసరాలకు, రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలి. చర్మ సంరక్షణ కోసం రోజూ 6 నుంచి 8 గ్లాసుల నీరు తాగాలి.
- పొడి దగ్గు, పిల్లి కూతలు, ఛాతిలో బరువు ముఖ్యంగా రాత్రివేళలో ఈ లక్షణాలు కనిపిస్తే అస్తమాగా భావించాలి.
- పెద్దల్లో దగ్గు మాత్రమే ఉంటే అస్తమా కాదు. రాత్రి, ఉదయం వేళలో అధికమవుతుంది. అధిక వ్యాయామం, అలెర్జీలు, చల్లటి గాలి ద్వారా తీవ్రమయ్యే అవకాశం ఉంది. అస్తమా మందులు వాడేవారు ఇన్‌హేలర్లు క్రమం తప్పకుండా వినియోగించాలి.



డాక్టర్ ఎం.పవన్‌కుమార్




- శీతాకాలంలో ఊపిరితిత్తుల సమస్యలు వస్తే న్యూమోనియా, ఇన్‌ఫ్లూంజాగా పరిగణిస్తారు. వ్యాక్సినేషన్ వల్ల ఇన్‌ఫెక్షన్ తీవ్రత తగ్గే అవకాశం ఉంది.
- గుండె వ్యాధులు ఉన్నవారు మందులు రెగ్యులర్‌గా వాడాలి. కొందరిలో గుండె వేగం తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. వైద్యులను సంప్రదించాలి.



బాబోయ్.. చలి

జిల్లాలో చలితీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. సాయంత్రం 6 గంటలు అయ్యిందంటే చాలు జనం బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. పొగమంచు కురవడంతోపాటు చల్లటి గాలులు వీస్తున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నగరంలో వివిధ పనులు చేసుకునే వారు, గ్రామాల్లో చీకటి పడగానే చలిమంటలు వేసుకుంటున్నారు. ఉదయం 10 గంటల వరకు కూడా మంచు వీడడం లేదు.

జిల్లాలో ఎనిమిది రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లలో)



సమతుల్య ఆహారం తప్పనిసరి

వేడివేడి పదార్థాలు తీసుకోవాలి

రవీందర్‌రెడ్డి, డైటీషియన్, ఎంజీఎం

ఎంజీఎం : చలికాలంలో వేడివేడి పదార్థాలతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఆలుగడ్డ, బీట్‌రూట్, క్యారెట్, మష్రూమ్స్ వంటి దుంప కూరలు శరీరంలో వేడిని పుట్టిస్తాయి. వీటిలో ఫైబర్, విటమిన్‌లు పుష్కలంగా ఉండడంతో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

- వేరుశనగ, బాదం, జీడి పప్పు, పిస్తా, కర్జూర వంటి తృణ ధాన్యాలు తీసుకోవాలి. ఇవి బలవర్ధకమైన ఆహారంతోపాటు శరీరంలో వేడిని పుట్టిస్తాయి.
- చలికాలంలో యాపిల్, అరటిపండ్లు, బొప్పాయి, పైనాపిల్ వంటివి తీసుకోవాలి. వీటిలో ఫైబర్ ఉంటుంది. వేడిని ఉత్పత్తి చేస్తాయి.
- వంట గదిలోని ఆవాలు, ఎండు మిర్చి, మెంతులు, అల్లం, లవంగాలు, దాల్చిన చెక్క, పసుపు, జీరా వంటి ద్రవ్యాలు శరీరంలో వేడిని ఉత్పత్తి చేయడానికి సహకరిస్తాయి. జలుబు, దగ్గు, వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి ఉపశమనం పొందేందుకు ఉపయోగపడుతాయి.
- శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్స్, చక్కెర పదార్థాలు, స్వీట్లు, కేకులు, ఫ్రైడ్ రైస్, ఆల్కహాల్, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండాలి.
- చలిగాలి వెళ్లకుండా తల, చెవుల భాగాలు మఫ్లర్‌తో కప్పి ఉంచాలి. స్వెటర్లు వేసుకోవాలి. ముఖ్యంగా బయటికి వెళ్లినప్పుడు మఫ్లర్‌గానీ, మంకీక్యాప్ పెట్టుకోవాలి.



రవీందర్‌రెడ్డి, డైటీషియన్



న్యూస్‌రీల్

అసెంబ్లీలో.. నారాయణపురం భూసమస్యపై ప్రస్తావన

- ధరణితోనే ఇబ్బంది వచ్చిందని మంత్రి పొంగులేటి వ్యాఖ్య



కేసముద్రం: అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం కేసముద్రం మండలం నారాయణపురం రైతులు ఇన్నేళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యను ప్రస్తావించారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వెబ్‌సైట్‌తోనే సమస్య వచ్చిందని వ్యాఖ్యానించారు. గతంలో 149, 150, 154, 165, 166, 168 సర్వే నంబర్‌లలో 1,398.03 ఎకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో ఫారెస్టు భూమి అని చూపడం వల్ల రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రైతులు అప్పటి ప్రజాప్రతినిధులను కలిసినా.. సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత పరిష్కార మార్గం కొనుగొన్నామన్నారు. కాగా నారాయణపురం గ్రామ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యను మంత్రి పొంగులేటి అసెంబ్లీలో ప్రస్తావించడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

జిల్లా రవాణాశాఖ అధికారిపై వేటు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా రవాణా శాఖ అధికారి భద్రునాయక్‌పై వేటుపడింది. రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ శాఖ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా జిల్లా రవాణాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా జైపాల్‌రెడ్డిని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ఆర్టీఓ అధికారులు ట్రాక్టర్లు, లారీల డ్రైవర్ల నుంచి వాహనాలకు సరైన పత్రాలు లేవని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో చేసిన పోస్టు వైరల్‌గా మారింది. ఈక్రమంలో రాజకీయ ఒత్తిడితోనే ఆర్టీఓపై వేటుపడిందని తెలుస్తోంది.

మురుగు తొలగించారు..



దోర్నకల్: స్థానిక మెయిన్ రోడ్డులో డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగును బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఇటీవల సాక్షి దినపత్రికలో 'మూసుకుపోయిన డ్రెయినేజీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించారు. డ్రెయినేజీపై నాపరాళ్లు తొలగించి మురుగు, వ్యర్థాలను తొలగించారు.

ఏఎంవీఐగా వెంకట్‌రెడ్డి బాధ్యతలు



మహబూబాబాద్ అర్బన్: జిల్లా రవాణాశాఖ కార్యాలయ అసిస్టెంట్ మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ)గా వెంకట్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పనులు వెంటనే పూర్తి చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్: వసతి గృహాలు, పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని వసతి గృహాల సంక్షేమ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలు, పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం అందేలా చూడాలన్నారు. శానిటేషన్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డైనింగ్ హాల్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతీ విద్యాసంస్థలో సైకాలజిస్ట్‌తో క్లాసులు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, జెడ్పీ సీఈఓ పురుషోత్తం, ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీపీఓ విజయనిర్మల, సీపీఓ సుబ్బారావు, డీపీఓ హరిప్రసాద్ ఉన్నారు.

సర్వేలో పొరపాట్లకు తావివొద్దు..

గూడూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మండలంలోని బొద్దుగొండలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం పరిశీలించారు. అనంతరం దామరవంచ, అయోధ్యపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏహెచ్‌ఎస్ హైస్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, కాలేజీలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



గూడూరు: సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

సమర్థవంతంగా నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్: సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు క్రీడలు జరుగుతాయని, ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, ఆర్డీఓ కృష్ణవేణి, క్రీడాశాఖ అధికారిణి జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలువు సంబురం

జాయినింగ్ పత్రాలు అందుకున్న గ్రూపు-4 ఉద్యోగులు

- జిల్లాకు 37మంది కేటాయింపు
- మానుకోట మున్సిపాలిటీకి 25మంది ఉద్యోగులు
- విధులను వివరించిన కమిషనర్ రవీందర్
- మిగిలిన మూడు మున్సిపాలిటీల్లో 12 మంది అలాట్



వార్డు ఆఫీసర్లుగా జానియింగ్ పత్రాలు అందుకున్న గ్రూపు-4 ఉద్యోగులు

మహబూబాబాద్: గ్రూపు-4 ఉద్యోగం సాధించిన అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోగా.. జిల్లాకు కేటాయించిన 37మంది అభ్యర్థులకు బుధవారం మానుకోట మున్సిపల్ కమిషనర్ జాయినింగ్ ఆర్డర్ పత్రాలు అందజేశారు. కొంతమంది విధుల్లో చేరగా మరికొంత మంది మంచిరోజు చూసుకుని విధుల్లో చేరుతామని చెప్పారు.

నాలుగు మున్సిపాలిటీల్లో ఉద్యోగుల భర్తీ..

2022లో గ్రూపు-4నోటిఫికేషన్ వేయగా, 2023 జూలై 1న పరీక్ష నిర్వహించారు. 2024 నవంబర్ 14న ఫలితాలు విడుదల కాగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. కాగా జిల్లాకు కేటాయించిన వారిలో మానుకోట మున్సిపాలిటీలో 25 మందిని వార్డు ఆఫీసర్లుగా అలాట్ చేశారు. అలాగే డోర్నకల్ మున్సిపాలిటీకి ముగ్గురు, మరిపెడకు నలుగురు, తొర్రూరు మున్సిపాలిటీకి ఐదుగురిని వార్డు ఆఫీసర్లుగా కేటాయించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

జాయినింగ్ ఆర్డర్ల అందజేత..

జాయినింగ్ ఆర్డర్లు అందుకున్న ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరవచ్చు. లేదా 60రోజుల వ్యవధిలో ఎప్పుడైనా విధుల్లో చేరవచ్చని అధికారులు వారికి వివరించారు. కాగా కొంత మంది విధుల్లో చేరగా.. మరికొంతమంది మంచిరోజు చూసుకొని జాయిన్ అవుతామని పేర్కొన్నారు.

విధుల గురించి వివరించిన కమిషనర్

వార్డు ఆఫీసర్ విధుల గురించి మానుకోట కమిషనర్ నోముల రవీందర్ వివరించారు. మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా ఆరుగురు మాత్రమే వార్డు ఆఫీసర్లు పని చేస్తున్నారని.. కొత్త వారితో వారి సంఖ్య 31కి చేరుతుందన్నారు. వార్డులో శానిటేషన్ పర్యవేక్షణ, పన్నుల వసూళ్లు, ఇంటి నంబర్లు ఇతర పనులు చేయాల్సి ఉంటుందని వారికి క్షుణంగా వివరించారు.

ఉద్యోగం ధైర్యాన్ని నింపింది



లేట్ వయసులో ఉద్యోగం రావడంతో నా కుటుంబానికి ధైర్యం వచ్చింది. నాతో పాటు కుటుంబ సభ్యులు ఎంతో సంతోషపడుతున్నారు. విధులు సక్రమంగా నిర్వర్తిస్తా. - బి.రమేశ్, వార్డు ఆఫీసర్

ఆనందంగా ఉంది..



ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఉద్యోగానికి న్యాయం చేసేలా పని చేస్తాను. ప్రభుత్వం ఉద్యోగం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. -టి.రవీందర్, వార్డు ఆఫీసర్

ఉద్యోగానికి న్యాయం చేస్తా..



కష్టపడి చదివితే ఉద్యోగం వస్తుంది. చిన్న వయసులో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. ఉద్యోగానికి న్యాయం చేసి మంచి పేరు తెచ్చుకుంటా. - ఈ.రమ్యచంద్రిక, వార్డు ఆఫీసర్

అర్హులకు న్యాయం జరిగేలా పని చేస్తా




నాకు ఇచ్చిన వార్డులోని పేదలకు న్యాయం చేస్తా. నాకు ఇచ్చిన పనిని సమర్థవంతంగా పూర్తి చేస్తా. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తా. ఉద్యోగానికి అన్ని విధాలా న్యాయం చేస్తా. - దండ లక్ష్మి, వార్డు ఆఫీసర్

విద్యార్థులు సైన్స్‌పై దృష్టి సారించాలి

- డీఈఓ రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు సైన్స్‌పై దృష్టి సారించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. జీవశాస్త్రం ఉపాధ్యాయులు విద్యార్థులను ఒలింపియాడ్‌లో పాల్గొనే విధంగా తీర్చిదిద్దాలన్నారు. పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. కాగా పోటీల్లో జ్యోత్స్న, సంగీత ప్రథమ స్థానంలో నిలువగా.. దేవేందర్, సోని ద్వితీయస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాక్లిన్, డీఎస్ఓ అప్పారావు, రాష్ట్ర బాధ్యులు విష్ణువర్ధన్, భాస్కర్, సునీత, సోమేశ్వర్, నవీన్, హరిశంకర్, జనార్దన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నూతన ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం కస్తూర్బా పాఠశాలల్లో నూతనంగా ఎంపికైన మహిళా టీచర్లకు ఆర్డర్ కాపీలను డీఈఓ అందజేశారు. జిల్లాలో 9 కస్తూర్బా పాఠశాలల్లో మొత్తం 28 పోస్టులకు 23 పోస్టులు భర్తీ చేశామన్నారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయకుమారి, ఏడీ రాజేశ్వర్, ఏసీజీఈ శ్రీరాములు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బోనస్ కోసం వ్యాపారి అడ్డదారి

కొత్తగూడ: ప్రభుత్వం సన్న ధాన్యానికి ప్రకటించిన బోనస్ కోసం వ్యాపారులు అడ్డదారి తొక్కుతున్నారు. అలాంటి ఘటన మండలంలోని కొత్తపల్లిలో బుధవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి గ్రామంలోని వ్యాపారి రైతుల వద్ద సన్నధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి గోదాంలో భద్రపరుచుకున్నాడు. అదే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన బస్తాల్లోకి మార్చి లారీలో లోడ్ చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. పీఏసీఎస్ పొగుళ్లపల్లి అనుబంధ కొనుగోలు కేంద్రానికి కేటాయించిన లారీగా గుర్తించారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయడానికి పత్రాలు, తేమ తనిఖీ అంటూ నానా కొర్రీలు పెడుతున్న అధికారులు వ్యాపారి గోదాం వద్ద ఎలా లోడ్ చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై డీసీఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా వ్యాపారి ధాన్యం లోడ్ విషయమై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వ్యాపారి గోదాం వద్ద లారీలో ధాన్యం లోడ్

విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: నల్లగొండ జిల్లాలో ఈనెల 28 నుంచి 30వరకు జరగనున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి యాకూబ్, ఉపాధ్యక్షురాలు స్వప్న, కోశాధికారి నాగమల్లయ్య, కార్యదర్శులు వివేక్, రమేష్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోరాటాలకు సిద్ధం కావాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే ఏకైక మార్గమని, అందుకోసం పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ వార్డుల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తున్న పార్టీ నాయకులకు ప్రజలు అనేక సమస్యలు ఏకరువుపెడుతున్నారన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య, నాయకులు సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, రావుల రాజు, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిపిరి యాకయ్య, బానోత్ హేమానాయక్ తదితరులు ఉన్నారు.

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

- ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు

మహబూబాబాద్ రూరల్: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగుపై మక్కువ చూపేవిధంగా ఏఓలు చర్యలు తీసుకోవాలని ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. మహబూబాబాద్ ఏడీఏ కార్యాలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని ఏఓలతో శాఖాపరమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల క్రయవిక్రయాల్లో డీలర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా ఏఓలు పర్యవేక్షణ చేయాలన్నారు. పంటల సాగు సమయంలో రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఓలు తిరుపతిరెడ్డి, రామారావు, ఉదయ్, రాంజీ, మహేందర్ ఉన్నారు.

వచ్చిందే టైం..

- సమయ పాలన పాటించని మండల పరిషత్ సిబ్బంది

తొర్రూరు: నిర్ణీత సమయానికి విధులకు హాజరు కావాల్సిన మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆలస్యంగా వచ్చారు. ఈ ఘటన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఉదయం 11 గంటల వరకు కూడా కార్యాలయానికి ఉద్యోగులు హాజరుకాలేదు. అప్పటివరకు కార్యాలయం బయట స్థానికులు వేచి ఉన్నారు. ఉపాధిహామీ పథకంలో కోళ్ల ఫామ్ ఏర్పాటు నిమిత్తం అధికారులతో మాట్లాడేందుకు మండలంలోని దుబ్బతండా పంచాయతీ పరిధిలోని భీమునితండాకు చెందిన జాటోతు సురేష్ వచ్చాడు. ఆ సమయంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీకే వినతిపత్రం సమర్పించాడు. దీనిపై ఎంపీడీఓ నర్సింగరావును వివరణ కోరగా ఇందిరమ్మ ఇళ్ల పథకం యాప్ సర్వే కొనసాగుతోందని, ఆ సర్వేలో మండల పరిషత్ ఉద్యోగులందరూ పాల్గొంటుండటం వల్ల విధులకు హాజరవడంలో ఆలస్యమైందన్నారు.



కార్యాలయంలో ఉద్యోగులు రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

అరగంట ముందే పీహెచ్‌సీకి తాళం!

కేసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది సాయంత్రం 3.30 గంటలకే తాళంవేసి వెళ్లినట్లు స్థానికులు ఆరోపించారు. వివరాలు ఇలా ఉన్నాయి..అమీనాపురం గ్రామానికి చెందిన సీరుటి జలేందర్ కాలుకు దెబ్బతగలడంతో వైద్యం కోసం పీహెచ్‌సీకి వెళ్లాడు. అప్పటికే వైద్య సిబ్బంది ఆస్పత్రిలోని గదులకు తాళాలు వేసి వెళ్లిపోయారు. సాయంత్రం 4 గంటల వరకు ఉండాల్సిన సిబ్బంది, 3.30 గంటలకే వెళ్లిపోయారని, దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జలేందర్‌తోపాటు ఎల్లయ్య, శ్రీను డిమాండ్ చేశారు. కనీసం తమకు మందులు ఇచ్చే వైద్యసిబ్బంది కూడా లేరని వారు వాపోయారు. ఈ విషయంపై మెడికల్ ఆఫీసర్ నంబీకిషోర్‌ను వివరణ కోరగా, వ్యాకినేషన్ కార్యక్రమం ఉండటంతో ఫీల్డ్‌లోకి వెళ్లానని, సిబ్బంది సాయంత్రం 3.55 గంటల సమయంలోనే ఆస్పత్రికి తాళం వేసి వెళ్లినట్లు తెలిపారు.



పీహెచ్‌సీకి తాళం వేసి వెళ్లారని చూపుతున్న స్థానికులు

చలిగాలి రాకుండా తడకలు ఏర్పాటు చేసుకోవాలి

● పశువులు, గొర్రెలు, మేకలకు తగిన టీకాలు వేయించుకోవాలి





హన్మకొండ: చలికాలంలో పశువులు, గొర్రెలు, మేకల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువ. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తగిన టీకాలు వేయించుకోవాలి. రాత్రి పూట వెచ్చగా ఉండడానికి కరెంట్ బల్బులు ఏర్పాటు చేయాలి. ఇంకా చలి ఎక్కువ ఉన్నట్లు అనిపిస్తే కొన్ని జంతువులకు హీటర్లు వాడాలి. రాత్రివేళల్లో ఉండే గదుల్లోకి చల్లని గాలి ప్రవేశించకుండా గ్రీన్ నెట్‌లు, కొబ్బరి పీచుతో తయారు చేసిన తట్లతో కప్పు వేయాలి. తడకల ద్వారాలను మూసివేయాలి. రేకులపై కొబ్బరితో తయారుచేసిన పీచు లేదా గడ్డి పరచాలి. పడుకునే ప్రదేశంలో ఎండుగడ్డి పరిచి వెచ్చగా ఉండేలా చేయాలి. అన్ని జంతువులకు తాగడానికి గోరు వెచ్చని నీరు.. అందులో ఎలక్ట్రాల్ ఫౌడర్, దాణాలో ఖనిజ లవణ మిశ్రమాలను(అమైనో ఆసిడ్స్) ప్రతిరోజు కలపాలి. శాకాహార జంతువులకు ఉప్పు గడ్డలు కట్టాలి. వాటిని నాకడం ద్వారా లవణాలు శరీరంలోకి వెళ్లి సమతుల్యత లభిస్తుంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఈగలు, దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తిని తగ్గించాలి.

- డాక్టర్ సి.హెచ్.ప్రవీణ్‌కుమార్, వర్ధేపల్లి పశువైద్యాధికారి

వరి నారులో జాగ్రత్తలు అవసరం





హన్మకొండ: యాసంగిలో వరి నారు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చలి సమస్యను అధిగమించడానికి నారుమడులపై ఇనుప చువ్వలతో లేదా వెదురు కర్రలతో ఊతం ఇచ్చి పల్చని పాలిథిన్ షీట్ లేదా పట్టా సాయంత్రం సమయంలో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. అలాగే వరిలో జింక్ లోపం లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. నివారణకు లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే నారు తీయడానికి ఏడు రోజుల ముందు 400 గ్రాముల కార్బోఫిరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవాలి. తద్వారా పంట తొలి దశలో చీడ పీడలను సమర్థవంతంగా తట్టుకోవచ్చు. 25 నుంచి 30 రోజుల నారు ప్రధాన పొలంలో నాటుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. నాట్లు ఆలస్యం అయ్యే పరిస్థితిలో రెండో దఫాలో నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూసుకోవాలి.

- డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహపరిశోధన సంచాలకుడు

మామిడి పూత దశలో జాగ్రత్తలు తీసుకోవాలి



హన్మకొండ: మామిడిలో పూత సాధారణంగా డిసెంబర్ చివరి వారంలో మొదలై జనవరి చివరి వరకు వస్తుంది. పూత రాలడం సహజం. మగ పుష్పాలు, ఫలదీకరించని పుష్పాలు రాలిపోతూ ఉంటాయి. పిందె దశలో ఎక్కువగా కాయ రాలకుండా రైతులు జాగ్రత్త వహించాలి. మామిడిలో పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత తెప్పించడానికి, ఆడ పూల శాతం పెంచడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు నివారణకు లీటరు నీటికి పాస్ఫామిడాన్ 0.5 మిల్లీలీటర్లు లేదా డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు, మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు కలిపి పూత మొదలయ్యే, పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులతో పాటు మొదళ్లు, కొమ్మలపై పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగులను అదుపు చేయడానికి పూత సమయంలో లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రొటోఫాస్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

మిరపకు పైపాటు పోషకాలు అందించాలి





హన్మకొండ: చలికి మిరప భూమిలోని పోషకాలు తీసుకోదు. పూత, ఆకులు రాలిపోతాయి. ఈ క్రమంలో పైపాటున పోషకాలు అందించడం ద్వారా పంటను కాపాడుకోవచ్చు. సూక్ష్మ పోషకాలను పంటపై పిచికారీ చేయాలి. మిరప పూత దశలో తామర పురుగులు ఆశిస్తాయి. పూత రాలి దిగుబడి తగ్గుతుంది. పురుగు తీవ్రత, సామూహిక నివారణకు నీలిరంగు జిగురు అట్టలను ఎకరాకు 40-50 వరకు పంటకు ఎత్తులో ఏర్పాటు చేయాలి. రసాయన పురుగు మందులు పిచికారీ చేయెుద్దు. వీటికి బదులు ఎన్ఎస్‌కేఈ, వేపనూనె, కానుగ నూనె, వావిలి రసం ఇందులో ఏదో ఒకటి లేదా బివేరియా బాస్సినా, సీడోమోనాస్ ఫ్లోరెసెన్స్, బాసిల్లస్ ఆల్బస్‌లో ఏదో ఒకటి నిర్ణీత మోతాదులో లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. చివరి అస్త్రంగా ఎసిఫేట్ 1.5 లేదా ఇథియాన్ 2.0 లేదా స్పినోసాడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- చేరాల రాకేశ్, ఉద్యాన అధికారి(టెక్నికల్), వరంగల్

నీతి ఆయోగ్ సమావేశంలో రవీందర్‌రెడ్డి



సమావేశంలో రవీందర్‌రెడ్డి

వరంగల్: 'వ్యవసాయంలో ప్రైస్ డెఫిసిట్ పేమెంట్ స్కీం'(పీడీపీఎస్) అనే అంశంపై బుధవారం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రం నుంచి తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. పీడీపీఎస్ స్కీంపై మొదటిసారి జరిగిన ఈకమిటీ మీటింగ్ నీతి ఆయోగ్ చైర్మన్ ప్రొఫెసర్ రమేశ్ చంద్ అధ్యక్షతన జరగగా.. నీతి ఆయోగ్ మెంబర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ బీఓఎస్‌గా సవితాజ్యోత్స్న



సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా (బీఓఎస్)గా ఆ విభాగం ప్రొఫెసర్ సవితాజ్యోత్స్నను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశా రు. ఇప్పటి వరకు ఆ బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆ విభాగం ప్రొఫెసర్ ఎస్. జ్యోతి నుంచి బుధవారం సవితాజ్యోత్స్న బాధ్యతలు స్వీకరించారు.


జాతీయ సదస్సుకు సతీశ్




సతీశ్

వరంగల్ చౌరస్తా : బెంగళూరు విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు, కన్నడ జానపద – గిరిజన సాహిత్యం తులనాత్మకత జాతీయ సదస్సుకు శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సోనబోయిన సతీశ్ ఎంపికయ్యారు. 'తెలంగాణ బోనం-సంస్కృతి పరిశీలన' అనే అంశంపై బెంగుళూరు విశ్వవిద్యాలయంలో పత్రాలు సమర్పించానని సతీశ్ తెలిపారు. ప్రిన్సిపల్‌కు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.


'భద్రకాళి' అంచున ఆదిమానవులు?



శిలలకు రాష్ట్ర కూటుల నాటి శిల్పాలు



చెరువు మధ్యలో గుట్టపై రాతి యుగం ఆధారాలు



చెరువు అంచులో ఆదిమానవులు జీవించిన పడగరాయితో కూడిన గుహలు

జీవనం సాగించినట్లు ఆధారాలు లభ్యం

- చారిత్రక ఆధారాలకు సాక్ష్యం.. భద్రకాళి చెరువు తీరం
- చెరువు మధ్యలో ద్వీపంలా గుట్ట.. రాతి పనిముట్ల పరిశ్రమ ఆనవాళ్లు
- పూడికతీత పనుల కోసం చెరువు ఖాళీ.. బయటపడుతున్న రహస్యాలు
- పురావస్తుశాఖ సమగ్ర సర్వే చేస్తే మరిన్ని విశేషాలు : డిస్కవరీమ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్ : చారిత్రక నేపథ్యం కలిగిన వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు చుట్టూ అనేక రహస్యాలు, విశేషాలు వెలుగుచూస్తున్నాయి. వేలాది ఏళ్లుగా ఆది మానవులు, అనేక రాజవంశాలు, ఆధ్యాత్మిక పరులు మొదలుకొని నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని ఎదుర్కుంటున్న ఆధునిక మానవులను ఈ చెరువు ఆకర్షిస్తున్నది. ఇదే తరుణంలో 50 ఏళ్ల తర్వాత భద్రకాళి చెరువులో పూడిక తీత పనులు చేపట్టేందుకు నీటిపారుదల శాఖ నీటిని ఖాళీ చేసింది. దీంతో పరిశోధకుల దృష్టి చెరువులోని గుట్టలపై పడింది. బుధవారం ఈ చెరువుపై పరిశోధన జరిపిన డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్ రెడ్డి భద్రకాళి చెరువు, చెరువు చుట్టూ ఉన్న గుట్టల సౌందర్యం వర్ణణాతీతమని చెప్పొకొచ్చారు. భద్రకాళి చెరువు అంచున ఆదిమానవులు జీవించిన గుహలు, చెరువు మధ్యలో ద్వీపంలా ఉండే గుట్టపై రాతి పనిముట్ల పరిశ్రమ, బృహత్ శిలాయుగం నాటి సమాధులు, కాకతీయుల నాటి సైనికులు కోట వెనుక నుంచి రహస్య మార్గం గుండా వచ్చి చెరువులోకి దిగడానికి వీలుగా ఉన్న మెట్ల మార్గాలను ప్రతాప్, హేమంతులతో కలిసి చారిత్రక ఆధారాలను గుర్తించినట్లు రత్నాకర్ రెడ్డి వెల్లడించారు.

- హనుమద్గిరి తటాక్ ఆంజనేయస్వామి ఆలయం వెనకనుంచి చెరువులోకి దిగితే రెండు శిలలపై చెరువు ముఖంగా శిల్పకళ ఉట్టిపడే విధంగా రాష్ట్ర కూటుల కాలం నాటి వినాయకులు చాముండీ దేవి శిల్పాలు, రెలింగ్ మధ్యలో ఉన్న శివలింగాలు, నంది విగ్రహాలు సూర్యుడు శిల్పాలు ఉన్నాయి.
- ఈ శిల్పాలపై భాగంలో విశాలమైన ఒక గుహ ఉంది. ఈ గుహలో సామాన్య పూర్వ సంవత్సరం 12000 నుంచి సామాన్య పూర్వ సంవత్సరం 2000 మధ్యకాలంలో ఆదిమానవులు తలదాచుకున్నట్లు తెలుస్తోంది.
- గుహలోపల పెద్ద ఇటుకలు ఉండడంతో ఈ గుహలో సిద్ధులు లేదా రుషులు నివసించే వారని తెలుస్తున్నది.
- గుహ ముందట కోడుగుడ్డు ఆకృతిలో ఉన్న రెండు గ్రూవ్స్ ఉన్నాయి. గుహ ముందటినుంచి గుట్ట చివరి అంచు వరకు నిర్మితమైన కోట గోడలు కనిపిస్తాయి. ఇక్కడ కుడి వైపునుంచి కాకతీయుల పాలకులు నిర్మించిన కోట లోపలి వైపు వెళ్లడానికి రహస్య మార్గం ఉంది. ఈ మార్గం గుండా సైనికులు చెరువులోకి దిగి స్నాన పానాదులు, దాహార్తిని తీర్చుకోవడానికి వీలుగా శిలను తొలిచిన మెట్లు ఉన్నాయి.
- చెరువు వైపు దిగువన ఏటవాలుగా ఉన్న శిలపై ఆలయం నిర్మించే ప్రయత్నాలు చేసినట్లు తొలిచిన పునాదులు సాక్ష్యంగా ఉన్నాయి.
- ఈ ఆలయ రాతి పునాదుల పక్కన శిలకు అసంపూర్ణంగా చెక్కిన భైరవ శిల్పం ఉంది.
- సిద్ధుల గుట్ట వెనుక వైపు భద్రకాళి చెరువు మధ్యలో ద్వీపంలా ఉన్న గుట్టపై నవీన శిలాయుగం నాటి ఆది మానవులు రాతి పనిముట్లను తయారుచేసుకున్న పరిశ్రమ ఉంది. 50కి పైగా గ్రూవ్స్ (పొడవైన బద్దులు ఉన్నాయి)
- గుట్ట పూర్తి ఉపరితలంలో సమతల ప్రదేశంలో బృహత్ శిలా యుగం నాటి డాల్మెన్ సమాధి ఉంది. చెరువులో రాక్షస గుళ్లను పురావస్తు శాఖ గతంలో గుర్తించింది. అయితే పురావస్తుశాఖ సమగ్ర పరిశోధన చేస్తే మరిన్ని చారిత్రక సత్యాలు వెల్లడి కానుండగా, అభివృద్ధి చేస్తే భద్రకాళి చెరువు, చెరువు చుట్టూ ఉన్న గుట్టలు పర్యాటకులను మరింత విశేషంగా ఆకట్టుకుంటాయని పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి మీడియాతో తెలిపారు.

అంత్యక్రియల్లో అపాయం..

- శ్మశాన వాటికలో గాజు పెంకులు గుచ్చుకుని తలకొరివి పెడుతున్న బాలికకు గాయం
- నర్సంపేట శ్మశాన వాటికలో ప్రమాదకర పరిస్థితి



శ్మశానవాటికలో చితి సమీపంలోనే గాజు పెంకులు

నర్సంపేట : హిందూ సంప్రదాయం ప్రకారం చనిపోయిన వారి అంత్యక్రియల్లో తలకొరివి పెట్టే సమయంలో చితి చుట్టూ చెప్పులు లేకుండా తిరగాల్సి ఉంటుంది. ఈ సమయంలో శ్మశాన వాటికల్లో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు లేకుండా చూసుకోవాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఓ బాలికకు అపాయకర పరిస్థితి ఎదురైంది. పుట్టెడు దుఃఖంలో తన తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో శ్మశాన వాటికలో ఉన్న గాజు పెంకులు కాళ్లకు గుచ్చుకుని రక్తం చిందించింది. ఈ ఘటన నర్సంపేటలోని వరంగల్ రోడ్డులోని శ్మశానవాటికలో జరిగింది. పట్టణానికి చెందిన లాయర్ బిల్లా రాంరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం అతడి కూతురు సిరి తలకొరివి పెట్టింది. ఈ సమయంలో గాజు పెంకులు కాలికి గుచ్చుకుని రక్తస్రావమైంది. ఓ పక్క తండ్రిని కోల్పోయి కన్నీరుమున్నీరవుతుండగా, మరో పక్క కాలికి సీసా ముక్కలు గుచ్చుకున్నాయి. దీంతో రక్తం చిందించడంతో విలవిలలాడింది. దీనిని చూసిన పట్టణ వాసులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మీయులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న వారికి శ్మశాన వాటికల్లో అపాయకర పరిస్థితులు లేకుండా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 40వేల జనాభా ఉన్న నర్సంపేట మున్సిపాలిటీలో ఇంత నిర్లక్ష్యంగా శ్మశాన వాటికలు ఉండడం దారుణమని మండిపడ్డారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే వెంటనే స్పందించి శ్మశాన వాటికల్లో రక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

నొప్పి తీవ్రంగా ఉంది..



మా నాన్నకు తలకొరివి పెడుతున్న సమయంలో చెప్పులు లేకుండా చితి చుట్టూ తిరుగుతుండగా కాలికి గాజు పెంకులు గుచ్చుకుంది. ఆ నొప్పి భరించలేకుండా ఉంది. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

-బిల్లా సిరి, మృతుడు రాంరెడ్డి కూతురు

కనీస సౌకర్యాలు అంతంత మాత్రమే..

నర్సంపేటలోని శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు అంతంత మాత్రమే ఉన్నాయి. మూత్రశాలలు, నీటి వసతులు, దుస్తులు మార్చుకునే గదులు, విద్యుత్ లైట్లు లేవు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయాలి

- జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు



స్వాగతమహోత్సవంలో పీఠాధిపతి ప్రొఫెసర్ బాబురావు, సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. బుధవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో ఎంఏ తెలుగు కోర్సు నూతన విద్యార్థుల స్వాగత మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భూక్య బాబురావు మాట్లాడుతూ వరంగల్‌లో పీఠం ప్రారంభమైన 30సంవత్సరాల తరువాత పీజీ కోర్సు రావడం సంతోషకరమని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ బాబురావును విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞానపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు శ్రీమంతుల దామోదర్, చూరేపల్లి రవికుమార్, బాసాని సురేశ్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ గంపా సతీశ్, పరావస్తు విజయలక్ష్మి, సిద్ధోజు సునంద, ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి

- కేయూలో మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనభవనం వద్ద ధర్నా నిర్వహించారు. దీనిపై సమాచారం అందుకున్న రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, హాస్టళ్ల డైరెక్టర్ ఎల్‌పి. రాజ్‌కుమార్.. ఆందోళన చేస్తున్న విద్యార్థినుల వద్దకు వచ్చి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిటీ హాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి.. విద్యార్థి నాయకులు, ఆయా విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. దీంతో విద్యార్థినులు తమకు హాస్టల్ వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వీసీకి తెలిపారు. ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మరోఆరునెలల్లో విద్యార్థినులకు హాస్టల్‌వసతి కోసం కృషిచేస్తామన్నారు. బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ కల్లెపెల్లి ప్రశాంత్, అధ్యక్షుడు శివకుమార్, నాయకులు రాజేశ్, ధర్మేందర్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ షమీమ్ అక్తర్‌కు ఘన స్వాగతం

- ఎస్సీ వర్గీకరణపై నేడు హనుమకొండ కలెక్టరేట్‌లో అభిప్రాయ సేకరణ



జస్టిస్ షమీమ్ అక్తర్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి

హన్మకొండ : ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ చేపట్టేందుకు బుధవారం హనుమకొండకు చేరుకున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌కు అధికారులు ఘనస్వాగతం పలికారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి స్వాగతం పలికారు. నేడు హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఎస్సీ వర్గీకరణపై వివిధ వర్గాల నుంచి వినతులు, అభిప్రాయాలు స్వీకరించనున్నారు.

ఆలిండియా బాక్సింగ్ టోర్నమెంట్‌కు కేయూ జట్టు

కేయూ క్యాంపస్: గురుకాశీ యూనివర్సిటీలో ఈనెల 18న ప్రారంభమై.. 24వ తేదీ వరకు కొనసాగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ బాక్సింగ్ (ఉమెన్) జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వెంకయ్య బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనబోతున్న వారిలో బి. అఖిల, ఎస్. జ్యోతి, ఎ. నందిని, నవ్యశ్రీ, బి.రుద్ర , సీహెచ్ దివ్య, ఎ. శ్రీదేవి, కె. స్నేహ, ఎం. ఉషాఅరుణ్య, నబియాఆనమ్ ఉన్నారు. వీరికి కోచ్‌గా హనుమకొండ శివాని డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎస్. రమేశ్, మేనేజర్‌గా ఆసిఫాబాద్ టీజీటీ డబ్ల్యూఆర్ డీసీ ఫిజికల్ డైరెక్టర్ బి. హారిక వ్యవహరించనున్నారని స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వెంకయ్య తెలిపారు.

బిహార్ తాపీకూలీ దారుణ హత్య

తన భార్యను చూస్తున్నాడని చంపిన భర్త

- కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో ఘటన
- ఘటనా స్థలిని సందర్శించిన వరంగల్ ఏసీపీ నందిరామ్‌నాయక్
- పోలీసుల అదుపులో నిందితులు?



మృతుడి అన్నచంద్రకుమార్‌తో మాట్లాడుతున్న ఏసీపీ నందిరామ్‌నాయక్

ఖిలా వరంగల్: బిహార్ తాపీ కూలీ దారుణ హత్యకు గురయ్యాడు. తన భార్యను చూస్తున్నాడనే కారణంతో భర్త.. ఓ యువకుడిపై దాడికి పాల్పడి మరో యువకుడిని ఐరన్‌రాడ్‌తో తలపై మోది దారుణంగా హత్య చేశాడు. ఈఘటన మంగళవారం అర్ధరాత్రి వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి సోదరుడి కథనం ప్రకారం.. బిహార్‌లోని ఖగారీయా జిల్లా పస్రహ తానా మండలం జంజారా గ్రామానికి చెందిన ముని దూల్‌చంద్రకుమార్ రెండేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటకు వచ్చారు. ఇక్కడ అద్దెకుంటూ తాపీమేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం చంద్రకుమార్ తమ్ముడు ముని దిల్‌ఖుషికుమార్(16), మరో యువకుడు పవన్ కూడా వరంగల్ రాగా ముగ్గురు కలిసి భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. పనిచేసే చోట వీరికి ఎస్ఆర్ఆర్‌తోటలో అద్దెకుంటున్న బానోత్ నగేశ్ పరిచయమయ్యాడు. ఇటీవల నగేశ్ అత్తామామలు చంద్రకుమార్ ఉండే ఇంట్లో ఓ రూమ్‌లో అద్దెకు దిగారు. నగేశ్ భార్య తన పిల్లలను తీసుకుని తరచూ పుట్టింటికి వచ్చేది. ఈ క్రమంలో ఇటీవల నగేశ్ తన భార్యను చూస్తున్నారని అనుమానంతో చంద్రకుమార్, దిల్‌ఖుషికుమార్ వద్దకు వచ్చి 'నా భార్యను అంతలా చూస్తున్నారు.. చంపేస్తా' అంటూ బెదిరించి వెళ్లిపోయాడు. మంగళవారం రాత్రి దిల్‌ఖుషికుమార్ రూమ్‌కు వెళ్లగా చంద్రకుమార్ తన స్నేహితులు గుల్షాన్, బాదిల్‌తో కలిసి చిన్న బ్రిడ్జి ఏరియాలోని మేఘనా బార్‌కు వెళ్లారు. ఈ క్రమంలో నగేశ్, అతడి బావమరుదులు అశోక్, బన్నీ ద్విచక్రవాహనంపై అక్కడి చేరుకుని చంద్రకుమార్‌ను చితకబాది చంపేందుకు యత్నిస్తుండగా తప్పించుకున్నాడు. రాత్రి 12గంటలకు వరకు బయటే ఉండి అనంతరం భయపడుకుంటూ రూమ్‌కు వెళ్లగా తమ్ముడు ముని దిల్‌ఖుషికుమార్ రక్తమడుగులో చనిపోయి ఉన్నాడు. దీంతో నగేశ్ తన భార్యపై అనుమానంతో తనను చంపడానికి యత్నించగా తప్పించుకున్నానని, తమ్ముడు ముని దిల్‌ఖుషికుమార్‌ను కిరాయికి ఉన్న ఇంట్లోనే హత్య చేశాడని చంద్రకుమార్ మిల్స్‌కాలనీ పీఎస్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఏసీపీ నందిరామ్‌నాయక్.. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలిని సందర్శించారు. మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలను స్థానికుల నుంచి సేకరించారు. మృతుడి సోదరుడు చంద్రకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.

నేరస్తుల కోసం గాలింపు: ఏసీపీ

భార్యపై అనుమానమే ఈ హత్యకు ప్రధాన కారణంగా భావిస్తున్నామని ఏసీపీ నందిరామ్‌నాయక్ స్పష్టం చేశారు. నిందితులను పట్టుకునేందుకు గాలిస్తున్నామని తెలిపారు. అయితే నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు మాత్రం పరారీలో ఉన్నారని చెబుతుండడం గమనార్హం.

విద్యార్థులు పరిశోధనల్లో రాణించాలి: డీఈఓ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

విద్యారణ్యపురి: విద్యార్థులు జీవశాస్త్ర పరిశోధనల్లో రాణించాలని హనుమకొండ డీఈఓ వాసంతి అన్నారు. జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, వివిధ గురుకులాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం హనుమకొండలోని రీజినల్ సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి జీవశాస్త్ర ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈపోటీల ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు అబ్దుల్ కలాం ఫౌండేషన్ అందించిన బహుమతులు, సర్టిఫికెట్, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి, ఫోరం అధ్యక్షుడు డాక్టర్ కె.వాసు, అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిధి శివనాగేశ్వర్‌రావు, ఫోరం బాధ్యులు బి.సునీత, డాక్టర్ ఎం.సారంగపాణి, సోమలింగం, కృష్ణమూర్తి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, లింగమూర్తి, సంధ్య, శ్రీరామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే..

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో కె.అక్షయ్‌రామ్ (జెడ్పీహెచ్ఎస్ పంథిని), ఎస్ భరత్ (మోడల్ స్కూల్, కమలాపురం), ఎన్.సిరిచందన (లష్కర్ బజార్ బాలికల ఉన్నత పాఠశాల, హనుమకొండ), ఎన్.సిరి (కేజీబీవీ ఐనవోలు) ఉన్నారు.

అధిక పన్ను వస్తే అప్పీల్ చేసుకోవాలి

- ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ముకాంబికీవాన్



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ముకాంబికీవాన్

వరంగల్ చౌరస్తా : అధిక ఆదాయ పన్ను వస్తే ఆప్పీల్ చేసుకుంటే వివాద్ సే విశ్వాస్ 2-0 ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ముకాంబికీయన్ తెలిపారు. బుధవారం వరంగల్ స్టేషన్ రోడ్డులోని గాయత్రీ హోటల్‌లో ఆదాయ పన్నుపై అవగాహన జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్నుల విషయంలో వివాదాలు లేకుండా అప్పీల్‌తోపాటు అసెస్‌మెంట్ విధానం ప్రవేశపెట్టిందన్నారు. డిప్యూటీ కమిషనర్ రవి కిరణ్ మాట్లాడుతూ 2020 సంవత్సరంలో 1.48లక్షల మంది అధిక పన్నులపై దరఖాస్తు చేసుకుంటే 54 శాతం కేసులు పరిష్కారించడం ద్వారా భారీ ఎత్తున లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు మహేందర్, అవినాశ్, ట్యాక్స్ బార్ అధ్యక్షుడు త్రిపురనేని గోపిచంద్, ఐసీఏఐ వరంగల్ చైర్మన్ భాగవాన్, చాంబర్ కామర్స్ కార్యదర్శి వేద ప్రకాశ్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు సంపత్ కుమార్, టెక్స్‌టైల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా నమఃశివాయ, తదితరులు పాల్గొన్నారు.